



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రూ.2.20 కోట్ల ప్రజాధనం వృధా

- నిర్మించారు.. గాలికి వదిలేశారు
- వినియోగంలోకి రాని బస్టాండ్
- కనీస అవసరాలు కూడా ఏర్పాటు చేయని వైనం
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - వేంపల్లె

పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని నూతన బస్టాండు నిరుపయోగంగా మారింది. పట్టణ ప్రజల సౌకర్యార్థం గత ఏడాది శిథిలావస్థకు చేరుకున్న పాత బస్టాండును పగలగొట్టి నూతన బస్టాండును వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్మించారు. చిన్నచిన్న పనులు మినహా నూతన బస్టాండు దాదాపు పూర్తయింది. సార్వత్రిక ఎన్నికల రావడంతో నిర్మాణ పనులు ఆపివేశారు. తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఐదు నెలలు కావస్తున్నా వినియోగంలోకి తీసుకురావడంలోఅటు ఆర్టీసీ అధికారులు, ఇటు పాలకులు దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నచిన్న పనులు పూర్తిచేసి మౌలిక వసతులను ఏర్పాటు చేసి ప్రారంభించాలని పలువురు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం శూన్యం.

పులివెందుల నియోజకవర్గం, వేంపల్లెలో నిర్మించిన నూతన బస్టాండు అధికారుల అలసత్వం కారణంగా నిరుపయోగంగా మారింది. రూ2.20 కోట్లతో నిర్మించిన నూతన బస్టాండు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. హైదరాబాదు, విజయవాడ, చెన్నై, బెంగళూరు, తిరుపతి తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఈ బస్టాండ్లో వచ్చి పదినిమిషాలు ఆగేవి. నూతన బస్టాండు నిర్మిస్తుండడంతో బస్సులు రోడ్డుపైనే ఆగి ఆగనట్లుగా వెళ్ళిపోతున్నాయి. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే పట్టణ ప్రజలు వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. కనీస వసతులు సమకూర్చకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే కూర్చోలేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గత వైసిపి ప్రభుత్వం నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టింది. మధ్యలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో బస్టాండ్‌లో కనీస వసతుల ఏర్పాటు చేయలేకపోయారు. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమైంది. కనీసం ఆర్టీసీ అధికారులు కూడా బస్టాండు గురించి పటించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నాయి.

ఆరు ప్లాట్ ఫారాలతో బస్టాండు నిర్మాణం

ఐదు మండలాలకు కూడలిగా వేంపల్లెలో నూతన బస్టాండు నిర్మాణాన్ని వైసిపి ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించింది. ఈ బస్టాండు నిర్మాణంలో భాగంగా ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాల్, ఆరు ప్లాట్ పారాలు, పార్సిల్ విభాగం ఏర్పాటు చేశారు. వాషింగ్ రూమ్, చిన్నచిన్న మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులన్నింటినీ 10 రోజుల్లో పూర్తి చేయవచ్చని అధికారులు అంటున్నారు.

వినియోగంలోకి తేవాలని డిమాండ్

వేంపల్లె ప్రజల చిరకాల స్వప్నమైన బస్టాండ్ దాదాపు పూర్తి అయినప్పటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాలలో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు తదితర సుదూర ప్రాంతాలకు పట్టణ ప్రజలు వెళ్ళక తప్పడంతో అవస్థలు పడుతున్నారు. బస్టాండు కార్యకలాపాలు ప్రారంభమైతే తమకు తిప్పలు తప్పుతాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇకనైనా అధికార పార్టీ నాయకులు, పాలకులు, ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకుని బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలని చుట్టూ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.



బస్టాండు బయట బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఇబ్బందులు పడుతున్నాం..

వేంపల్లె నుంచి ఇతర నగరాలకు వెళ్లేందుకు బస్సు సదుపాయాలు లేక అవస్తులు పడుతున్నాం. బస్టాండు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తే సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. పైగా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది.

-పి.లక్ష్మీదేవి, మెయిన్ బజార్, వేంపల్లె

బస్టాండును వాడుకులోకి తేవాలి..

ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి పనులు ఆగకూడదు. ప్రభుత్వ ధనంతో చేపట్టిన పనులు నిరుపయోగంగా మారకూడదు. రూ2.20 కోట్లతో నిర్మించిన బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు అధికార పార్టీ, పాలకులు తగిన చర్యలు తీసుకోవాలి.

- ఆదిమూలం. ఉత్తయ్య, కాపు వీధి, వేంపల్లి.

రెండు నెలల్లో వినియోగంలోకి తెస్తాం..

బస్టాండు ఆవరణంలో మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతుల పనులను చేపట్టాల్సి ఉంది. ప్రయాణికుల కోసం సీటింగ్ ఏర్పాటు చేయాలి. టాయిలెట్ల నిర్వహణకు కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయాలి. ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తిచేసి రానున్న రెండు నెలల్లో బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం.

- రామకృష్ణ, పులివెందుల ఆర్టీసీ డిపో మేనేజర్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్, ప్రిన్సిపల్ సురేష్

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : జడ్జి

ప్రజాశక్తి - కడప

ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ అన్నారు. శుక్రవారం రిమ్స్ ఆవరణలోని వైద్య కళాశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ర్యాగింగ్‌లో సీనియర్ విద్యార్థులు కొత్తగా ప్రవేశించిన, జూనియర్ విద్యార్థులను అవమానించడం, వేధించడం వంటివి ఉంటాయని అన్నారు. ఇది తరచుగా ప్రాణాంతకంగా తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇందులో కొత్త వారు మానసిక, శారీరక హింసకు గురవుతారని తెలిపారు. ర్యాగింగ్‌లో లైంగిక వేధింపులు, స్వలింగ సంపర్క దాడులు, అక్షేప చర్యలు, అన్ని రకాల శారీరక వేధింపుల చర్యను ర్యాగింగ్ విభాగంలో క్రిమినల్ కేసులుగా చేర్చవచ్చునని చెప్పారు. ర్యాగింగ్ శిక్షలను ఈ సందర్భంగా జడ్జి ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, వైస్ ప్రిన్సిపల్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్లు సునీల్ రాజు, రిమ్స్ సెట్ ఇన్స్పెక్టర్ జయరాం, శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మెగాలోన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న ఆర్‌ఎం కిషోర్‌కుమార్‌రెడ్డి

కడప నగరంలోని నేక్ నామ్ ఖాన్ కళాక్షేత్రంలో ఈనెల 26, 27న నిర్వహించే ఎస్‌బిఐ హోమ్‌లోన్ ఉత్సవ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగత రుణాల ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. వాహన, గృహ నిర్మాణానికి, స్థలం లేదా ఇల్లు కొనడానికి రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పెన్షన్, విద్యా రుణం ఇవ్వనున్నామని తెలిపారు. స్వదేశంలో గుర్తింపు పొందిన కళాశాలల్లో చదువుకునేవారికి ఎటువంటి సెక్యూరిటీ లేదా గ్యారంటీ లేకుండా రూ.1.5 కోట్ల వరకు విద్యా రుణం మంజూరు చేస్తామని చెప్పారు. మహిళలకు వడ్డీ నుంచి 0.5శాతం రాయితీ కలదన్నారు.

ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వండి

ప్రజాశక్తి - సిద్దవటం : ఇసుకను తోలుకోవడానికి అనుమతి ఇవ్వాలని ట్రాక్టర్ యజమానులు కోరారు. శుక్రవారం భాకరాపేటలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సులో ట్రాక్టర్ యజమానులు తమ సమస్యలను సిద్ధవటం తహశీల్దార్ మురాపాషావలికి వినతిపత్రం ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యజమానులు నాగార్జున, శ్రీనివాసులు, సుబ్బరాయుడు మరికొంతమంది మాట్లాడుతూ కొంత కాలం నుంచి ఇసుక రవాణా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, ఇలాగైతే ట్రాక్టర్ ఫైనాన్స్ కంపెనీ వారికి నెలవారీ బకాయిలు ఎలా చెల్లించాలని వాపోయారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇటు ఆర్థికంగానూ, అటు మానసికంగానూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఉచితంగా రవాణా చేసుకోవచ్చని తెలుపుతున్నా అధికారులు అడ్డు చెబుతున్నారని పేర్కొన్నారు. స్పందించి తహశీల్దార్ అనుమతి తన పరిధిలో లేదని, కడప మైన్స్ ఎడి సంప్రదించాలని తెలియజేశారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నియోజకవర్గంలో 20 మంది లబ్ధిదారులకు రూ.19,94,59 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తుందని చెప్పారు. ఆర్థికంగా, పేద కుటుంబాలు సిఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రయివేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఒపి పేరుతో వందల రూపాయలు ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో, జిల్లాలో ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పేద ప్రజల నుంచి అధిక ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఒక్క ఒపి (ఔట్ పేషెంట్) ఫీజులు రూ.400, రూ.500 తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజల నుంచి ఈ స్థాయిలో వసూలు చేస్తున్నా వైద్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. కేవలం ఒపి ఫీజులు మాత్రమే కాదని వైద్యం చేయించుకోవడానికి వచ్చిన రోజులకు వివిధ రకాల టెస్టుల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర కన్వీనర్ విజయ్ పాల్గొన్నారు.

'నోరు అదుపులో పెట్టుకో పేర్ని నాని'

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న విజయ్‌సుశీల్‌కుమార్

నోరు అదుపులో పెట్టుకొని పేర్ని నాని మాట్లాడాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిమండలం విజయ్ సుశీల్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ఆస్తులు వ్యవహారంలో దమ్ము ధైర్యం ఉంటే జగన్ చేత ప్రెస్ మీట్ పెట్టి చెప్పించాలన్నారు. కుటుంబ వ్యవహారాల్లో చిల్లర మాటలు మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలపై పేర్నినాని అవాకులు జవాకులు పేలుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. రాబోవు మూడు నాలుగు నెలల్లో కచ్చితంగా సిబిఐ కోర్టు జగన్ జైల్లో పెడుతుందని, ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని కానీ, వైఎస్ షర్మిలను కానీ విమర్శిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని ఈ సందర్భంగా నందిమండలం విజయ్ సుశీల్ కుమార్ పేర్కొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఐఇటిఇ స్టూడెంట్ ఫోరం, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2024లో భాగంగా వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 'దేశం అభివృద్ధికి నైతికత సంస్కృతి' అనే ప్రధాన థీమ్ పై విద్యార్థులలో అవగాహన పెంపొందించారు. పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. మొదటి విజేత బి.ఆర్తికి రూ. 2,500 అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి, కల్చరల్ క్లబ్ కో - ఆర్డినేట్ డాక్టర్ వీర శంకర్, ఐఇటిఇ కో-ఆర్డినేటర్ పి.సుబ్బ రాయుడు, ఇసిఇ డిపార్ట్మెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి : వ్య.కా.స

ప్రజాశక్తి-అట్లూరు : భూ కబ్జాదారుల చేతుల్లోని భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములను పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దుర్గమ్మ, రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన ప్రతిసారీ పేదలకు దక్కాల్సిన భూములు కుంచించుకు పోతున్నాయని పేర్కొన్నారు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ నాయకులు భూములను ఆక్రమించుకోవడం సాధారణమైందని తెలిపారు. సోమశిల మునక ప్రాంతమునకు చెందిన వారి భూములను గత ప్రభుత్వంలో కొంతమంది నాయకులు ఆక్రమించుకుని అనుభవిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని వాపోయారు. నిర్వాసితులకు న్యాయం చేయలేదని పేర్కొన్నారు. మండలంలోని నల్లాయపల్లె పొలంలో సర్వే నంబర్ 40లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, పంచాయతీలో వందల సంఖ్యలో భూమిలేని పేదలు ఉన్నారని వారందరూ భూపోరాటంలో పాల్గొని ముళ్ళ పొదలు తొలగించారని, వారికి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు మంజురుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు గురమ్మ, స్వప్న, గంగయ్య పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉతోపియా 2కె24 జాతీయస్థాయి మేనేజ్మెంట్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ ఫెస్ట్‌లో వివిధ కళాశాలలకు చెందిన ఎంబిఎ చదివే 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా ఎంపికైన టీమ్‌కు ప్రథమ బహుమతి రూ.2000, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.1000తో పాటు కన్సొలేషన్ బహుమతులు, సర్టిఫికెట్లు అంద జేశారు. ముఖ్య అతిథిగా కడప యోగివేమన యూనివర్శిటీ బిజినెస్ మేనేజ్మెంట్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ సరిత విచ్చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. వెంకటేశ్వరరెడ్డి, చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పాండు రంగన్, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీర కళ్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.

షర్మిలకు అత్యాశ : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిలకు అత్యాశ అని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక వైసిపి నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షర్మిల జగన్‌కు చేసిన అన్యాయం ప్రజలకు వివరించాల్సిన అవసరం తమకుందని అన్నారు. షర్మిలమ్మ అనుబంధాలు ఆప్యాయతల గురించి మాట్లాడుతూంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె పుణ్యమా అని జగన్ ఇంటి రామాయణం బజారుకెక్కింది అన్నారు. షర్మిలకు వివాహమై దాదాపు 30 సంవత్సరాలవుతోందని తండ్రి దివంగత నేత వైఎస్ఆర్ మృతి చెంది 14 సంవత్సరాలవుతోందని, ఆయన స్వయానా భాగాలు పంచినప్పటికీ తండ్రి ఆస్తిలో ఇప్పుడేమి వస్తుందని ఆమె మాట్లాడుతోందని ప్రశ్నించారు. జగన్ స్వార్జితం చెల్లికి 2009 నుంచి 2019 వరకు రూ.200 కోట్లు నగదు ఇచ్చారని పేర్కొన్నారు. జగన్ కోర్టుకు వెళ్లలేని ఎన్‌సిఎల్‌టికి పోయారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అంతానికి చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్, సునీతలతో షర్మిల చేతులు కలిపారని విమర్శించారు. సరస్వతి పవర్ విషయంలో షర్మిల చెబుతున్నది అబద్ధం అన్నారు. అన్న పతనాన్ని కోరుకున్న చెల్లెలుగా షర్మిలమిగిలిపోతుందని రాచమల్లు అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'రాచమల్లు' వ్యాఖ్యలు సరికాదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తండ్రి పేరును అడ్డం పెట్టుకొని రు.43 వేల కోట్లు నాడు జగన్ ఆర్జించారన్నారు. జగన్ జైలు జీవితం గడిపే రోజుల్లో షర్మిల జగన్ కోసం పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఇలాంటి దుర్మార్గుడు రాష్ట్రానికి నాయకుడిగా మనకు అవసరమా అని ప్రశ్నించారు. నేటి నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.పార్టీ కార్యాలయం నుంచి ఐదుగురు సభ్యులు ప్రొద్దుటూరు రానున్నారని, భారీ సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. గతంలో రు.2 లక్షల భీమా ఇప్పుడురూ.5 లక్షలకు పెంచామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, బీసీ నేత చల్ల రాజగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

అమరావతి రైల్వే లైన్ మంజూరు హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె : కంద్ర ప్రభుత్వం అమరావతి రైల్వే లైన్ మంజూరు చేయడం హర్షణీయమని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి గుంటూర్ జిల్లాలోని నంబూరు వరకు రాజధాని అమరావతి మీదుగా రూ. 2245 కోట్లతో 57 కిలో మీటర్ల పొడవుతో, కృష్ణా నది మీద 3.2 కిలో మీటర్లు పొడవు వంతెనతో రైల్వే లైన్ చేశారన్నారు. రాష్ట్ర సమాగ్రాభివృద్ధికి, రాజధాని అమరావతితో పాటు దేశంలోని వివిధ నగరాలతో, పోర్టులతో అనుసంధానం చేసేందేరే ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. గతంలో 2017లో కూడా ఇలాగే అమరావతి రైల్వే లైన్ మంజూరు అయ్యిందని కాని ఆచరణలోకి రాలేదన్నారు. టిడిపి కూటమి పాలనలో రాష్ట్రం అనారోగ్య ఆంధ్రప్రదేశ్ అయ్యిందని చెప్పారు. డయేరియాను ఆరికట్ట లేని దద్దమ్మ ప్రభుత్వంగా తయారైందని చెప్పారు. జగ్గయ్యపేట, సామర్లకోట,పిడుగురాళ్ల, ఖాజీపేట ప్రాంతాలలో డయేరియాతో కొందరు చనిపోయారని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంటువ్యాధుల నివారణ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ సూచిస్తుందని చెప్పారు.

ట్రిపుల్‌ఐటి విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - వేంపల్లె



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్తా

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో విద్యాభ్యాసం చేస్తున్న ఇ-1 సిఎస్ఇ విద్యార్థి బెంగుళూరు సువర్ణను డైరెక్టర్ కుమార స్వామి గుప్తా అభినందించారు. ఈనెల 14 నుండి 18 వరకు గోవాలో నిర్వహించిన 33వ నేషనల్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్‌లో సువర్ణ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈనేపథ్యంలో విద్యార్థిని శుక్రవారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ యూనివర్సిటీ అధికారులు అభినందించారు. క్యాంస పతాకాన్ని గెలుచుకొనేందుకు కృషి చేసిన పవర్ లిఫ్టింగ్ కోచ్ మేనేజర్ డాక్టర్ తివారీ, పిడి ఓబయ్య, సుధాకర్ రెడ్డిని అభినందించారు. ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్ ఐటికి మంచి పేరు తెచ్చేందుకు విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించాలని డైరెక్టర్ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికుల స్థానిక సమస్యలు పరిష్కారం కోసం కడపలో వెస్ట్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో 44వ వార్డు సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ డివిజన్లలో పర్యటన చేసి కార్మికుల కలిసి వారి సమస్యలు తెలుసుకున్నామని పేర్కొన్నారు. ఈనెల 26లోగా పరిష్కరించాలని తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు పరిష్కరించకపోతే 28న కడప కార్పొరేషన్ ఆఫీస్ వద్ద మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. 70 ఏళ్లుగా ప్రజలకు తాగు నీటి సౌకర్యం కల్పించడంలో వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు ఎండకు, వానకు అత్యవసర పరిస్థితిలో కూడా మారుమూల ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వారికి జీవో నంబర్ 36 ప్రకారం రూ.24 500 జీతం ఇవ్వాలని కోరారు. మరో 13 మందిని డ్రైవర్లగా కొనసాగిస్తూ 36 జీవోను అమలు చేయాలని పేర్కొన్నారు. గూగుల్ మస్టర్ సమయాన్ని సడలింపు చేయాలని తెలిపారు. ఎందుకంటే దూర ప్రాంతాల నుంచి తెల్లవారు జామున హడావిడిగా డ్యూటీకి రావడం వల్ల అక్కడక్కడా ప్రమాదాలు జరిగిన ఘటన గతంలో చాలా ఉన్నాయని చెప్పారు. ఉదయం మస్టర్ సమయాన్ని సడలింపు చేయాలని కోరారు. రిటర్న్ మస్టర్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నటువంటి అన్ని విభాగాల కార్మికులకు ఉద్యోగస్తులకు ప్రస్తుత ధరలకు తగ్గట్టుగా జీతాలు లేవని, గత ప్రభుత్వంలో ఆ విభాగానికి ఏ సమయంలోనూ జీతాలు పెంచిన పాపాన పోలేదని పేర్కొన్నారు. జీతాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్మికుల పట్ల సానుభూతితో సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షాన 28న మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కమిటీ నాయకులు సుంకర కిరణ్, నాగరాజు, చెన్నయ్య, జోన్ కమిటీ నాయకులు సాయి, దస్తగిరిమ్మ, రమేష్, నరసింహులు, సుబ్బయ్య,నిత్య పూజయ్య, హరి, నరసింహారావు, మహేష్, కాటమయ్య పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : గంజాయి నిర్మూలనకు ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు నగరంలోని కొరియర్ కార్యాలయాలు, గోడౌన్‌లలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డిఎన్‌సిసి) ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా కాకుండా ఎస్‌పి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలో ఉన్న ట్రాన్స్ పోర్ట్, కొరియర్ కార్యాలయాలు, గోడౌన్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో డిఎన్‌సిసి అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బాణాసంచా విక్రయదారులు చట్టం సూచించిన నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. దీపావళి పర్వదినాన టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో టపాసులు ఎక్కడైనా అక్రమంగా విక్రయిస్తున్నా, నిల్వ ఉంచినా డయల్ 100 గాని, స్థానిక పోలీసు స్టేషన్‌లో గాని సమాచారం అందించాలని కోరారు. నీరు, ఇసుక, అగ్నిమాపక నిరోధక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లైసెన్స్‌లు కల్గిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. **ఫిర్యాదులకు తక్షణ న్యాయం చేయాలి** పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్యుల ఫిర్యాదులకు తక్షణం స్పందించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. గంజాయి, మెడికల్ షాప్‌లలో అక్రమంగా విక్రయించే మత్తు కలిగించే మాత్రల విక్రయాలపై నిఘా ఉంచి దాడులు నిర్వహించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ల ద్వారా నిఘా ఉంచి దాడులు ఉధృతం చేయాలని ఆదేశించారు. సమర్థవంతంగా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు డ్రోన్లను వినియోగించాలన్నారు.

కెజి పీజీ సెట్ విజయవంతం

ప్రజాశక్తి - కడప అర్బన్



విజేతతో ఎమ్‌డి, అధ్యాపకులు

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల మేనేజ్మెంట్ స్టడీస్ విజయవంతంగా నిర్వహించిన కెజిపిజి సెట్ - 2కె24 ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించారు. పరీక్ష ఫలితాల సక్సెస్ మీట్ శుక్రవారం కెఓఆర్ఎం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల విద్యా సంస్థల ఎమ్‌డి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. మొదటి ర్యాంక్‌ను షేక్.జైబా కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్ఇ మాట్లాడుతూ విద్యార్థికి ఉచిత విద్యా అందిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేట్ పోటీకి కావాల్సిన టెక్నికల్ అనాలసిస్ నాలెడ్జ్, బిజినెస్ కమ్యూనికేషన్ స్కిల్స్, అకాడమీ ఎక్సలెన్స్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్ పై అవగాహన అవసరమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ నాగమణి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు ప్రస్తుత మార్కెట్‌కు కావాల్సిన స్కిల్స్ అందించేందుకు ముందుంటామని తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపిఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె : వరి పంట సాగు చేసిన రైతుల నుంచి ఎంపిఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలోని వ్యవసాయ శాఖ కార్యాలయాలన్ని తనీఖీ చేశారు ఇడుపలపాయలోని రైతు సేవా కేంద్రాన్ని కూడా తనీఖీ చేసి రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ౖతులకు కావాల్సిన ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.బయట మార్కెట్ కంటే రైతులకు మంచి గిట్టుబాటు వచ్చేలా ఎంపిఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం త్వరలో కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు దిగాలు పడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన వరి పంటను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పులివెందుల సహాయ వ్యవసాయ అధికారి ప్రభాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజేంద్ర ప్రసాద్,ఆర్ ఎస్ కె సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సమాచార హక్కు చట్టంపై రైతులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఎడిఎ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎడిఎ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం- 2005 రైతులకు, సిబ్బందికి వ్యవసాయ అధికారి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమె మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన పొంది ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అడగవచ్చుని తెలిపారు. చట్టం ద్వారా పారదర్శకంగా, నిజాయితీగా పథకాలు అమలు చేసే విధంగా అధికారులు పని చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, డీలర్లు రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో జెఎన్‌టియు అనంతపురం తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఇందులో కెఎస్ఆర్ఎం విద్యార్థి ఒకరు ఉండటం విశేషం. వీరు ప్రాతినిధ్యం వహించడం పట్ల కళాశాల ఎం డి. డాక్టర్.కే చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ కె. రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, పీడీ నారాయణ హర్షం వ్యక్తం చేశారు.


కాలనీలో పరిసరాలను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరరావు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వ్యక్తిగతతోపాటు పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ ఉమామహేశ్వరరావు ప్రజలకు సూచించారు. ఎస్‌వి గిరి కాలనీలో జ్వరాల కేసులు నమోదు కావడంతో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శిల్పా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం కాలనీలో పర్యటించి పక్కనే పెద్ద కాలువను, పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ వారంలో ఒక రోజు డ్రై డే పాటించి ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కాలువలోకి మురుగు నీరు వదలడం, తిని పారవేసిన ఆహార పదార్థాలు, వ్యర్థాలు వేయడం వల్ల నీరు ప్రవహించడంలేదు. నీరు నిల్వగా ఏర్పడి మురుగు ఎక్కువై దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. దోమ కాటు వల్ల ప్రాణాంతకమైన విషజ్వరాలు వస్తాయన్నారు. కాలువలో నిల్వ ఉన్న మురుగు నీరు పారేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లారు. జ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు లక్ష్మయ్య, ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్ వైజర్ శోభారాణి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మసిస్ట్ జగదీష్, ఎఎన్ఎమ్ ఇందిరమ్మ, పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు భారతి, నీలవేణి, చంద్రావతి, సంధ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని యరగుడిపల్లెలో డ్రై డే - డ్రై డే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వ ఉన్న నీటిలో అబేట్ పిచికారి చేసి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగమణి, ఆశా కార్యకర్త రాజమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్ ఊసేలేదు : కాంగ్రెస్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా అమలు, కడప స్టీల్ ప్లాంట్ పై ఊసే లేదని పులివెందుల కాంగ్రెస్ పార్టీఇన్‌ఛార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సందర్భంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకహోదాతో పాటు ఇతర హామీలు ప్రకటించిందన్నారు. దుర దృష్టవశాత్తు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయని, దీంతో విభజన హామీలు, ప్రత్యేకహోదాను నీరుగార్చారన్నారు. ప్రస్తుత కేంద్రంలో ఇక కలిసిన కూటమి ప్రభుత్వానికి మంచి అవకాశమని, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేకహోదాపై కృషి చేయాలన్నారు. వైఎస్ షర్మిల ఎంపీ గెలిచింటే పార్లమెంటులో ప్రత్యేకహోదాపై ప్రశ్నించే వారని, పోరాటం చేసి నిలదీసేవారన్నారు.

ప్రజలకు సహకరించాలి

ప్రజాశక్తి-చెన్నూరు : మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది బాధ్యతగా మెలిగి ప్రజలకు సహకరించాలని ఎంపిడిఒ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లె, శివాలపల్లి సచివాలయాలను, పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా కార్యాలయ సిబ్బంది బాధ్యతతో అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని, రిజిస్టర్లలో రోజుకు మూడుసార్లు సంతకాలు చేయాలని పేర్కొన్నారు. ఏ సమయంలోనైనా ఎటువంటి సమాచారం అడిగినా తప్పనిసరిగా అందించాలని సూచించారు. సచివాలయాలలోకి వచ్చిన వారితో బాధ్యతతో మెలిగి సహకరించాలని తెలిపారు.

కానిస్టేబుల్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - ముద్దనూరు : దేశం కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన కానిస్టేబుల్ శామ్యూల్ సేవలు మరువలేనివని సిఐ దస్తగిరి పేర్కొన్నారు. పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం కడప 11వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ కె.వి రమణ ఆధ్వర్యంలో సిఐ దస్తగిరి శామ్యూల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలం లోని శెట్టివారిపల్లె గ్రామానికి చెందిన శామ్యూల్ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయి అమర వీరుడయ్యాడన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు సాంబశివారెడ్డి, మహిళా పోలీసులు ఆకాంక్ష, శివ జ్యోతి, పోలీసులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకట నారాయణ మృతికి నివాళి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకటనారాయణ గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు వై.ఎస్. మనోహర్ రెడ్డి శుక్రవారం వెంకటనారాయణ మృతదేహానికి నివాళులు అర్పించారు. అంతవరకు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ వల్లెపు వరప్రసాద్, కోఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- ఇద్దరు తమిళ కూలీలు అరెస్టు

ప్రజాశక్తి - సిద్ధవటం

సిద్ధవటం అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి ఆదేశాల మేరకు అటవీశాఖ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తుండగా మద్దూర్ బీట్ వద్ద కొన్ని శబ్దాలు వినిపించడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ కొంతమంది తమిళ కూలీలు ఎర్రచందనం నరికి వాటిని తరలిస్తున్నారు. గమనించిన సిబ్బంది వెంటనే వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారిలో ఇద్దరు తమిళ కూలీలు మాత్రమే పట్టుబడ్డారు. వారితో పాటు ఒక మోటార్ బైక్ స్వాధీనం చేసుకున్నామని ఈ విషయంపై విచారించి కేసు నమోదు చేశామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలియజేశారు కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సురేష్, ఎఫ్‌బిఒ దీపిక, విశ్వనాథ్ రెడ్డి, ఎబిఒ నాగభూషణం రెడ్డి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలోని చెన్నుముక్కపల్లె క్రాస్ రోడ్డు వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై ఈనెల 19న గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని రోడ్డు ప్రమాదం కారణంగా మృతి చెందాడని, అతని వయసు 45 సంవత్సరాల వరకు ఉంటుందని స్థానిక సిఐ మోహన్ శుక్రవారం తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9121100623 నెంబర్‌కు సంప్రదించాలని సిఐ సూచించారు.

పశుగణన పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పశుగణన పక్కాగా నిర్వహించాలని పశువైద్యాధికారి శారదమ్మ, ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. శుక్రవారం వారు 21వ జాతీయ పశుగణనను ప్రారంభించారు. పశుగణన సర్వే ప్రక్రియలో భాగంగా పశువైద్యాధికారులు 28 వరకు పశుగణన నిర్వహిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో పశువులు, పెంపుడు జంతువులు, గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు, కోళ్లు ఎన్ని ఉన్నాయనే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి పక్కాగా వివరాలను సేకరిస్తారన్నారు.. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ రెడ్డి, డిడి డాక్టర్ రంగ స్వామి, ఎడి డాక్టర్ శ్రీధర్, లింగారెడ్డి, ఎన్యుమరేటర్ మోహన్ సాయి పాల్గొన్నారు. **వల్లూరు :** పశుగణనకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కమలాపురం నియోజవర్గం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గ పరిధిలోని ప్రజ పశువుల యజమానులు తమ ఇళ్ల వద్దకు వచ్చే పశు సంవర్ధక సిబ్బందికి పశువుల పూర్తి వివరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పశువర్ధక కడప ఉప సంచాలకులు టి.వి. రమణయ్య, కమలాపురం సహాయకులు ఉత్తమయ్య, మండల పశు వైద్య అధికారులు డాక్టర్ మారుతి ప్రతాపరెడ్డి, మాధవరెడ్డి, శివ జ్యోతి, మండల టిడిపి ఇన్‌ఛార్జి లేబాక నాగేశ్వర్‌రెడ్డి, తాడిగొట్ల రాఘవరెడ్డి పాల్గొన్నారు. **ముద్దనూరు :** పశువుల జాబితా సేకరించేందుకు ప్రభుత్వం పశు గణన కార్య క్రమం చేపట్టినట్లు పశు వైద్యులు డాక్టర్ వాసా శ్రీనివాస తెలిపారు.కొత్తపల్లె గ్రా మంలో శుక్రవారం 21వ పశు గణన పోస్టర్ వాసా శ్రీనివాస ఆవిష్కరించి ప్రారంభించారు. **సింహాద్రిపురం :** పశు గణన సర్వేను పక్కాగా నిర్వ హించాలని పులివెందుల పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంగేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో 21వ పశు గణన సర్వే కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. కార్యక్రమంలో పశు సంవ ర్ధక శాఖ ఏడీ శివప్రసాద్, బిధనం చర్ల పశు వైద్యాధికారి యూనస్ పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ శేష ఫణి పశు గణన పోస్టర్లను స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ మున్నయ్య, వివిఎన్ పల్లె పశు వైద్యాధికారి డాక్టర్ సునీల్, ఎన్యూమరెటర్లు పాల్గొన్నారు.


వల్లూరు : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

శాస్త్రవేత్తలకు నాంది పశువైద్య కళాశాల
- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దేశ విదేశీ శాస్త్రవేత్తలకు జాతీయ సదస్సు ద్వారా ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాల పరిచయం చేసిందని, అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి మాట ద్వారా ఇక్కడ పశువైద్యశాల నిర్మాణానికి పూనుకోవడం ఆయన పరిపాలన విధానానికి నిదర్శనమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గోపవరం పంచాయతీ పరిధిలోని వెటర్నరీ కళాశాలలో శుక్రవారం బయో టెక్నలాజికల్ ఇన్నోవేషన్ జాతీయ ముగింపు సమావేశం నిర్వహించారు. సమావేశానికి విశిష్ట అతిథిగా ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ డాక్టర్ జెవి రమణ, డాక్టర్ డివిఆర్ ప్రకాశరావు, డాక్టర్ ఉమేష్ చంద్ర శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన పశు వైద్యశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి తన మాటను మన్నించి ఇక్కడ పశు వైద్యశాల నెలకొల్పారన్నారు. నాడు తాను తీసుకున్న నిర్ణయం ద్వారా వేలాది మంది విద్యార్థులు ఇక్కడ వెటర్నరీ డాక్టర్లుగా శిక్షణ పొంది పశు వికాసానికి తోడ్పడుతూ మూగజీవాలకు సేవ చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ అండ్ డాక్టర్ కె. బ్రహ్మయ్య, డాక్టర్ ధమని, డాక్టర్ సిహెచ్ శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజా కిషోర్ వ్యవహరించారు. ప్రిన్సిపల్, శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ ఇందిరా, వివిధ రాష్ట్రాల నుండి ఇక్కడికి విచ్చేసిన ప్రొఫెసర్లు, సైంటిస్టులు, పిహెచ్‌డి విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి - ముద్దనూరు

రెవెన్యూ శాఖకు సంబంధించి రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి తెలిపారు. ఆరవేటిపల్లెలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ భూ సమస్యలకు సంబంధించి రైతులు అర్జీలు అందజేయవచ్చన్నారు .పలు సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హర్ష వర్ధన్ రాజు, ఆర్ఐ సుదీప్ పాల్గొన్నారు. **కమలాపురం టౌన్ :** మండలంలోని పందిళ్లపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన భూ సర్వే తప్పిదాలను సరి చేసుకోవాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్ణయంతోనే అధికారులు తప్పులు చేశారని వాటిని సరిదిద్దుకుంటామని ,ఏవైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులుగా తాము సహకరి స్తామంటూ ఆయన తెలిపారు పందిల్లపల్లె గ్రామంలో 150 మంది రైతులు ఉంటే 60 మంది రైతులు అర్జీలు ఇచ్చారని, ఇంకా కొంతమంది రైతులు మధ్యలో ఇవ్వాల్సి ఉందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ రామకృష్ణ నాయక్ ,మండల సర్వేయర్, విఆర్ఓ పాల్గొన్నారు **కాశినాయన :** మండలంలో రీసర్వే జరిగిన గ్రామాలలో గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రజలు భూ సమస్యలు అర్జీ రూపంలో ఇవ్వాలని తహశీల్దార్ వెంకటసుబ్బయ్య తెలిపారు ఇప్పటికే నరసాపురం గంగనపల్లె గ్రామాలలో రీ సర్వే రెవెన్యూ సదస్సు నిర్వహించారని పేర్కొన్నారు. ఈనెల 29న గొంటువారిపల్లె, 30న పిట్టిగుంట, నవంబర్ 1న ఓబులాపురం, 5న వెంగళం పల్లె, 6న వంకమరి, 7న అక్కెం గుండ్ల, 12న అక్కంపేట గ్రామాలలో రీ సర్వే రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. ఆయా గ్రామాలలో భూములున్న ప్రజలు అర్జీ రూపంలో తెలియజేయాలని పేర్కొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి -కమలాపురంటౌన్

స్థానిక నగర పంచాయతీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో డిసిసి బ్యాంకు ఆవరణంలో అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు స్వతహాగా తయారు చేసిన పిండి వంటలను రుచి చూశారు. మరింత అభివృద్ధి చెందాలని, వారి కావాల్సిన ఆర్థిక సాయం బ్యాంకు రుణాల ద్వారా అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, నగర పంచాయతీ కమిషనర్, మెప్మా టౌన్ మిషన్ కో-ఆర్డినేటర్ నాగేంద్ర, లావణ్య, ప్రజోద్ కుమార్ పాల్గొన్నారు తర్వాత కమలాపురం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సందర్శించారు. అక్కడి వసతులు, సమస్యలను ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఇస్లాంపురం 9వర్డులో మూడు రోజులుగా నీరు రాకపోతవడంతో టిడిపి ఇన్‌ఛార్జి ముల్లా రహమతుల్లాకు స్థానికులు సమస్యను వివరించారు. ఆయన స్పందించి శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయించారు. సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడంతో స్థానిక ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. షేక్ ఖాజా మోదిన్, షేక్ చాంద్ బాషా, ముల్లా జాహిదుల్లా, షేక్ ఇమాంబాషా పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- వేముల

స్థానిక తుమ్మలపల్లె గ్రామ సమీపంలో ఉన్న యుసిఐఎల్ ప్రాజెక్టు ఎస్ఎంఎస్ కాలనీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్ ఖలీల్‌బాష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తగా కార్మికులకు బిపి, షుగర్ తో పాటు అన్ని రకాల జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది చౌదరి సురేష్ బాబు రామకృష్ణ పవన్ కుమార్ సురేష్‌రెడ్డి, వైద్యులుహుస్సేన్. సతీష్. బాబు. పుష్పరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాది సూర్యపెద్దిరాజు తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి భార్గవి ఆదేశాల మేరకు న్యాయవాది మండల పరిధిలోని నర్సోజి కొట్టాలలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం అందరికీ ఒకేలా ఉంటుందన్నారు. ఘర్షణ వాతావరణం జరిగినప్పుడు ఘర్షణకు దిగకుండా పోలీస్ స్టేషన్ ఆశ్రయించాలన్నారు. లేదా సివిల్ కోర్టు ద్వారా సివిల్ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

జవాన్ కుటుంబానికి మోసం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : మండలంలోని పాపిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన జవాన్ కొడవటికంటి రాజేష్ ఇటివల ఛత్తీస్‌గఢ్ మిజాపూర్ ఇండో టిబెటన్ బార్డర్‌లో వీరమరణం పొందారు. జవాన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వై.కె. విశ్వనాథ్ మాదిగ అన్నారు. జవాన్ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. జవాన్ రాజేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గౌరవ మర్యాదలు, సదుపాయాలు అందలేదని వారు విన్నవించడంతో సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు వారి యొక్క నిర్లక్ష్య సమాధానం పై ఆయన మండిపడ్డారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు ఈ వివరాలను ఫోన్ ద్వారా తెలియజేశారు. నవంబర్ 4న కడప జిల్లా పర్యటనలో భాగంగా మందకృష్ణ మాదిగ పర్యటనలో భాగంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు రాజు మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ మాదిగ, పిచ్చుక బాబు మాదిగ, ఎంఇ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరినాథ్, వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దాదాపు 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ తిరుపాల్ నాయక్ పరీక్ష తీరును పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో యువత ప్రాముఖ్యత, వారి పాత్రను గుర్తించడం ముఖ్య ఉద్దేశం ఉన్నారు. విద్యార్థులు తమ రచనల ద్వారా సైబర్ భద్రత, నేరాల నివారణకు సంబంధించిన ఆలోచనలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు

ప్రజాశక్తి - వేముల : అంతర పంటలతో అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర పంటలు వేసుకోవడం వల్ల ఒక పంటకు గిట్టుబాటు ధర లేకపోయినా మరొక పంట ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. ఎ గ్రేడ్ మోడల్‌లో అంతర పంటలకు రసం పీల్చు పురుగులు, తెల్లదోమ, పచ్చ దోమ నివారణకు పసుపు, బులుగు, తెలుపు, జిగురు లను ఉపయోగించడం వల్ల నివారణ అవుతాయన్నారు. లింగకర్షక బుట్టలు అమర్చి ఉపయోగించడం వల్ల రసం పీల్చేపురుగులను నివారించు కోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, రాజీవ్ రెడ్డి, రైతులు గంగాధర, రామకృష్ణ రెడ్డి, రమణమ్మ పాల్గొన్నారు.

పోలీసుల సేవలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు : సమాజంలో పోలీసులు అందిస్తున్న సేవలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ చిన్న పెద్దయ్య అన్నారు. పోలీసు అమరవీరుల స్మరణ దినోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో చాపాడు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పోలీసులు అందించే సేవలు, విధి విధానాలు విద్యార్థులకు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోని గదులను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు. పోలీసులు వినియోగించే సామగ్రి, రికార్డులు, ఎఫ్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. ఏవైనా ఇబ్బందులు ఏర్పడినప్పుడు, మన చుట్టూ పరిసరాలలో అసాంఘిక కార్యక్రమాలు జరిగినప్పుడు వాటిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నిలకడగా కుందూ ప్రవాహం

ప్రజాశక్తి - చాపాడు

కుందూ నదిలో నీటి ప్రవాహం కొన్ని రోజులుగా నిలకడగా ప్రవహిస్తుంది. ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో పడుతున్నటువంటి వర్షం కారణంగా నదిలో నీటి ప్రవాహం తగ్గకుండా ప్రవహిస్తుంది. ప్రస్తుతం పది రోజులుగా 6వేలు క్యూసెక్కులకు పైగా నీరు ఉంది. గత వారంలో కురిసిన వర్షానికి మరింతగా నీరు పెరిగింది. కుందూ తీర గ్రామాల్లో ఈ నీటిని ఆధారం చేసుకుని వరి, పసుపు ఇతర పంటలను రైతులు సాగు చేపట్టారు. గతంలో కుందూనీటి ఆధారంగా కెసి కెనాల్ నీటి కంటే ముందస్తుగా వరి పంటను రైతులు సాగు చేసేవారు. ఈ ఏడాది కెసి, కుందూ నదులకు ఒకేసారి నీరు విడుదల కావడంతో రైతులు వరి పంటను ఒకేసారి సాగు చేపట్టారు. కుందూ నదిలో నీరు సమృద్ధిగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణుల నమోదు వంద శాతం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె : గర్భిణుల నమోదు వందశాతం పూర్తి చేయాలని డిపిఎంయు డాక్టర్ నాగ శేషిభూషన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిపిఎంయు డాక్టర్ నాగ శశిభూషన్‌రెడ్డి తనిఖీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రతి గర్భిణి పేరును 12 వారాల్లో నమోదు చేయాలని సూచించారు. పేరు నమోదు చేస్తే ప్రమాదంలో ఉన్న గర్భిణులను గుర్తించి త్వరలో చికిత్స చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఎబిహెచ్ఎ ఐడిని ప్రతి గర్భిణికి లింక్ చేయాలని ఆదేశించారు. ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్య సూత్రాలు తెలియ జేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి సాయి, డాక్టర్ లక్ష్మీ ప్రియ, హైల్త్ ఎడ్యుకేటర్ షఫీ వున్నిసా బేగం, సిహెచ్ఒ వెంకట రత్నం, ఎంపిహెచ్ఇఒ ఫకృద్దీన్, సూపర్ వైజర్ అరుణ దేవి, సిహెచ్ఒ బస్సయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల దీర్ఘ కాలిక సమస్యలను పరిస్కరించాలని ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు రెండు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, పిఆర్‌సి బకాయిలు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. ఖాళీ పోస్టులను ప్రసుతం పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో భర్తీ చేయాలని కోరారు. పర్మనెంట్ ఉద్యోగులు చేయాల్సిన ప్రమాద పనులు సైతం కాంట్రాక్టు కార్మికులతో చేయి స్తున్నారని, అన్ని విధాలా అనుభవం కలిగిన కాంట్రాక్టు కార్మికులతో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తే విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందిం చవచ్చని అన్నారు. సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మోహన్ రావు , శంషేర్ వలి పాల్గొన్నారు.

ఘనంగా యంత్ర 2కె24 వేడుకలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్ : పులివెందుల జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో రెండవరోజు శుక్రవారం యంత్ర 2కె24 జాతీయ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ రాహుల్ రంజన్, హెడ్‌ఒపెరేటన్స్ (టెక్నికల్), ఎఎంకె ఇండస్ట్రీస్ ఎఫ్ -3 కార్ డిజైన్, పనితీరుని విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసం అరుణకాంతి, వైస్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి కళాశాల అధ్యాపకులు రామేశ్వర రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, చంద్ర శేఖర్, రాజేష్ ,పవన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్గదర్శకులు హోమిజె బాబా

ప్రజాశక్తి - వేముల : తుమ్మలపల్లి వద్ద ఉన్న యురేనియం కర్మాగారంలో డాక్టర్ హోమిజె బాబా జయంతి సందర్భంగా శుక్రవారం కార్మికులు, ఉద్యోగులు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన బిఎఎస్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ భవాని మాట్లాడుతూ హోమిజె బాబా అణుశక్తి రంగంలో మార్గదర్శకులుగా నిలిచారని పేర్కొన్నారు. అనంతరం యురేనియం యూనిట్ బృందం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంజయ్ చటర్జీ, డాక్టర్ బి. నవీన్ కెఆర్ రెడ్డి, వాసుదేవ్‌రెడ్డి, విజయ్ కుమార్, ఎల్.రాజేష్, ఎల్.కె.రంగయ్య, ఎల్.కె.రావు, కె.నాగరాజు, జె.డి.కన్నన్, టిసి.ఎస్.రెడ్డి, విపిన్ కుమార్ శర్మ, బిటిహోత్రి, సూర్యభాను సింగ్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నారా యణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కలిసిమెలిసి చదువుకోవాలని పేర్కొ న్నారు. సీనియర్లు జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడకూడదన్నారు. కళాశాలలో విద్యార్థులకు సంబంధించి అన్ని వసతులను ఏర్పాటు చేశామన్నారు. అధ్యాపకులు చెప్పే అంశాలు ఆచరణలో పెట్టి బాగా చదువుకోవాలని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. అనంతరం కళాశాల ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయ ణరెడ్డి, కళాశాల డైరెక్టర్ వెంకట సుబ్బారెడ్డి, ఎ. నీరజ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు